## వ్యవసాయ వర్సిటీ సలహా కమిటీ సభ్యుడిగా కోటపాటి

**ఆదేశాలు జారీచేసిన వ్యవసాయ విశ్వవిద్యాలయం**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన-విస్తరణ సలహా కమిటీ సభ్యుడిగా కోటపాటి నరసింహం నాయుడును నియమించారు. ఈ మేరకు అధికారులు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సలహా కమిటీ సభ్యుడిగా రెండేండ్లపాటు ఆయన కొనసాగనున్నారు. కోటపాటి దక్షిణ భారత రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా అనేక రాష్ట్రాల రైతులు, వారి పంట విధానాలపై విస్తృతంగా అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా 48వ ఆర్ఈఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వంగడాలపై పరిశోధనలు జరగాలని కోరారు. సేంద్రియ పద్ధతులు, పశువుల పోషణ ద్వారా ఎరువులు, వ్యర్థ జలాలను శుద్ధి చేసి పంటలకు ఉపయోగించడం భారతీయ పురాతన వ్యవసాయ విధానమని వివరించారు. రైతులు పంటల పెట్టుబడులు తగ్గించుకుని.. అధిక దిగుబడులు సాధించే మార్గాలను అన్వేషించాలని సూచించారు.




తమపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



అంతర్గాం మండలం ముర్మూరు వద్ద కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి, బీఆర్ఎస్ నాయకులు

## ఉట్నూర్ ఎక్సైజ్ ఎస్సైకి క్యాష్ రివార్డు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ఉట్నూర్ ఎక్సైజ్ ఎస్సై బానాల మురళీకృష్ణను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి గురువారం అభినందించారు. మురళీకృష్ణ 2023లో భద్రాచలం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సమయంలో 28 కేజీల గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత చార్జిషీట్ సిద్ధం చేసి కోర్టుకు సమర్పించగా, ఇటీవల కోర్టు నిందితుడికి 3 ఏండ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించింది. దీంతో కేసును పకడ్బందీగా సిద్ధం చేసిన మురళీకృష్ణకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి క్యాష్ అవార్డును అందజేశారు.



## 59 మంది సీనియర్ సివిల్ జడ్జీల బదిలీలు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 59 మంది జూనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ హైకోర్టు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 24లోగా ప్రస్తుతం నిర్వహిస్తున్న విధులను సంబంధిత అధికారులకు అప్పగించి బదిలీ అయిన ప్రదేశంలో బాధ్యతలు చేపట్టాలని రిజిస్ట్రార్ (విజిలెన్స్) ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే వాదనలు పూర్తయి రిజర్వు చేసిన కేసుల్లో తీర్పు వెలువరించవచ్చని తెలిపారు.

# కాంగ్రెస్ గూండాగిరీ!

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి సంబంధం లేకపోయినా.. 'అడగడానికి మీరెవ్వరు? అంతా మా ఇష్టం' అంటూ బీఆర్ఎస్ నాయకులపై మూకుమ్మడిగా దాడికి దిగారు. తమపై దాడిచేసిన కాంగ్రెస్ నాయకులు కొమిరిశెట్టి తిరుపతి, పర్శ హనుమాండ్లుపై బీఆర్ఎస్ గంభీరావుపేట పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటియాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గోగు లింగంయాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నిరసన

దాడి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రామ్మోహన్, జనగామ శరత్‌రావు, విజయరామారావు, గుండారపు కృష్ణారెడ్డి, చీటి లక్ష్మణ్‌రావు, వర్స కృష్ణహరి, సబ్బని హరీశ్ ఆధ్వర్యంలో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల నుంచి దాదాపు 200 మంది కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. జరిగిన ఘటనపై సీఐ శ్రీనివాస్‌గౌడ్ బీఆర్ఎస్ నేతలతో చర్చించారు. దాడి చేసిన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్టు చేయాలంటూ వారు ఫిర్యాదు చేశారు. వారిపై కేసు నమోదు చేసేదాకా పోలీస్ స్టేషన్‌లో ఉంటామని పట్టుబట్టారు. విచారణ జరిపి, కేసు నమోదు చేస్తామని సీఐ హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్ నాయకులు ఆందోళన విరమించారు.

### కాంగ్రెస్‌ది రాక్షస పాలన

ప్రజాపాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలన కొనసాగిస్తున్నదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో పెట్టకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడంపై ప్రశ్నించారు. అధికారులు వ్యవహరిస్తున్న తీరు బాగాలేదని, పద్ధతి మార్చుకోకపోతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

## కేసీఆర్ కృషితోనే సాగు సస్యశ్యామలం

- **ముర్మూరు లిఫ్ట్‌తో నీళ్లు**
- **మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**
- **కృతజ్ఞతగా కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం**

అంతర్గాం, ఏప్రిల్ 17: మాజీ సీఎం కేసీఆర్ కృషి, ముందుచూపుతోనే పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం సస్యశ్యామలంగా మారిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రూ.80 కోట్లతో అంతర్గాం మండలం ముర్మూరు వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయడం వల్లే నేడు అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో ప్రతి ఎకరాకు సాగునీరు అందుతున్నదని తెలిపారు. లిఫ్ట్ ఏర్పాటుకు కృతజ్ఞతగా గురువారం ముర్మూరు గ్రామం వద్ద కేసీఆర్ చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నా రామగుండం ప్రాంతం చుక్కనీరు వాడుకోలేని దుస్థితిలో ఉన్నదని అన్నారు. అంతర్గాం, పాలకుర్తి మండలాలకు సాగునీరు అందించాలన్న సంకల్పంతో కేసీఆర్ ముర్మూరు వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేయించారని గుర్తుచేశారు.



తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయాన్ని ముట్టడించేందుకు వెళ్లిన వర్సిటీల్లోని కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ అధ్యాపకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

## కాంట్రాక్టు లెక్చరర్లను మోసం చేసిన కాంగ్రెస్

- **హామీలు అడిగితే అరెస్టులా?**
- **అధ్యాపకులను వెంటనే విడుదల చేయాలి**
- **ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజం**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : వర్సిటీల్లోని కాంట్రాక్టు, పార్ట్‌టైమ్ అధ్యాపకులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందని ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ మండిపడ్డారు. మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని గురువారం ఒక ప్రకటనలో ఆయన ధ్వజమెత్తారు.



గ్రూప్-1 అభ్యర్థులను కూడా మోసం చేసిందని దుయ్యబట్టారు. విద్యా బోధన చేసేవారిని మోసం చేసి, ఓట్లు దండుకొని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకుని, పోస్టులను వెంటనే క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నియామకాల్లో పార్ట్‌టైమ్ టీచర్లకు అనుభవం ప్రకారం వెయిటేజ్ కల్పించి, తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. హామీ నెరవేర్చాలని అడిగితే అరెస్టు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే కాంట్రాక్ట్ టీచర్ల సమస్యను పరిష్కరించి, అరెస్టు చేసినవారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రేమికులకు పోలీసు రక్షణ హక్కు కాదు

**అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలు**

ప్రయాగ్‌రాజ్: తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా, ప్రేమించి పెండ్లి చేసుకున్నవారు తమకు పోలీసు రక్షణ కల్పించాలని ఓ హక్కుగా కోరకూడదని అలహాబాద్ హైకోర్టు చెప్పింది. అర్హత గల కేసుల్లో కోర్టులు రక్షణ కల్పిస్తాయని, ఎటువంటి ముప్పు లేని సందర్భాల్లో అటువంటి దంపతులు ఒకరికొకరు సహకరించుకోవడం, సమాజాన్ని ఎదుర్కొనడం నేర్చుకోవాలని చెప్పింది. శ్రేయ కేసర్వాని, ఆమె భర్త దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు ఈ రూలింగ్ ఇచ్చింది. తమ తల్లిదండ్రులు, ఇతర బంధువుల నుంచి తమకు రక్షణ కల్పించాలని వీరు కోరారు. పిటిషనర్లకు ప్రమాదం ఉందనే భావన కనిపించడం లేదని హైకోర్టు తెలిపింది. పిటిషనర్లతో ఎవరైనా తప్పుగా ప్రవర్తించినా, శారీరకంగా దాడి చేసినా కోర్టులు, పోలీసులు తగిన చర్యలు తీసుకుంటాయని స్పష్టం చేసింది.



తులం బంగారంపై మాట తప్పిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కమ్మర్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## మాటతప్పిన సీఎంపై కేసునమోదు చేయాలి

**పలు పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ నేతలు**

మోర్తాడ్, ఏప్రిల్ 17: తులం బంగారంపై మాటతప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని పలు పోలీసుస్టేషన్లలో గురువారం ఫిర్యాదు చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.లక్ష చెక్కుతోపాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ మేరకు మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ ఠాణాల్లో ఫిర్యాదు చేశారు. భీమ్‌గల్‌లో బుధవారం జరిగిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో తులం బంగారం ఏమైందని ప్రజల పక్షాన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించినందుకు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులను ఉసిగొల్పారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.

## సాధారణ కాన్పుల సంఖ్య పెరగాలి

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ కాన్పుల సంఖ్య పెరగాలని, ఇందుకుగాను నర్సులకు మిడ్ వైఫరీ ట్రైనింగ్ ఇప్పించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. గురువారం కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీలో అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అకారణంగా సిజేరియన్ డెలివరీలు చేస్తున్న ప్రైవేట్ దవాఖానలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో వసతులను మెరుగుపర్చాలని, ప్రభుత్వ దవాఖానల్లో డెలివరీ చేయించుకునేలా గర్భిణులను ప్రోత్సహించాలని, ఎండకాలం దృష్ట్యా దవాఖానల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

